# నిరుక్తము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ



అనుకొనకే, మనోభవుని యాయుధవాహనసంచయంబు మో
సిన శకటంబుఁబోలెఁ గడుఁ జేరువగాఁ జనుచుండి, కోస దే
లిన తుదకంటివెల్గువిదళింపులు నన్నును దాఁకనీయకుం
డిన దయలేని నీనడక నిన్నును నీవుగ మెచ్చుకోవలెన్.

తమదగు సందమెల్ల వనితాజనతాస్పృహణీయమంచు గ
ర్వముగల యౌవనోదయ ధురాపరినర్తితభావు లున్న మా
ర్గమున నె కన్నువ్రాల్పకయ గర్వపురేఖను మొక్కవోని మేల్
గమనము పోవు నీవు ననుగాని యపాంగములందుఁ బట్టవున్.

పాలును లేకయే స్పృహయుఁబట్టక కారణమౌచు నెవ్వడో
యేలనొ తోఁచనట్టు లుదయించిన మన్మథుఁడైన కాంతలే
పోలనికన్నులన్ మలఁగిచూడరు చూచినవెంటనే కనుల్
వ్రాలుతు రట్టి నాయెడ నిరాదృతి నీయది విడ్డురంబకో.

ముక్కిడియైన కోఁతియును మోమును నద్దమునందుఁ గాంచి బల్
చక్కనిదాన నంచుఁ దలఁచంగల యాత్మగతాభిమానమే
గ్రుక్కిలి నాదునందమును గూర్చి వచింపఁ దలంపఁజాలనే
మిక్కిలి నీవు నాయెడ రమించుటకై యెదురైనఁ జూడనే.

నినుఁ గనుఁగోవటం చనను నిద్దురపోవలదా! పగంటఁ జూ
చినఁ గలలోనవత్తును నిసిన్, గనుఁగో వనుచున్ జివుక్కుమం
చనినది గుండె, దాని ననుమంటిన! నా కటువంటియూహ కీ
జనువునఁ బొత్తులేదను నిజమ్ము నెఱుంగనొ నన్నెఱుంగనో.

ఇన్నియుఁ జెప్పి నీ కనుల నెత్తి ననుం గనుఁగోవటంచు నే
నన్నది యేమిన్యాయ మని యాడెదవో నిను నాడు మంటినో
యెన్నితలంపులైన నుదయించు లయించు దరిద్రునందు, నా
యెన్నియునేని పుట్టుట లయించుటయే పరమార్థమౌఁగదా!

నావలపోఁత నీదుశ్రవణంబుల చేరద, యంత యేటికో
నావలపోఁత యేరిశ్రవణంబులచేరద, యంత యేటికో
నావలపోఁత వాక్త్వకలనంబును పొందద, భావరూపమై
భావముకూడ లోయెదకుఁ బట్టిన జబ్బుగనై గతించెడున్.

చేయక చేసినట్లు శ్రుతిచేసిన యూహాలు మేనుగల్గు దీ
ర్ఘాయు లదృష్టజన్ము లగునట్టిరు నాదగు మూర్తి చూచియే
పాయుదు రింక నాదయిన భావ మెఱింగిరయేని నన్ను గో
మాయువు స్వర్గబుద్ధి యగుమాదిరి వెట్టరె వెక్కిరింపులన్?

లేని మనోంతరాంతరవిలీనవిగాఢవిషాదగీతికా
నూననిరుక్తభావ మిది, నొవ్విననొవ్వెఱుఁగంగరాని ప్రా
ణానికి లోతులోని చలనంబును, సర్వజగచ్ఛ్రివో మనః
ప్రాణసుదూరవర్తియగు భావము కానుకగాని కాన్కయౌ.

ఈ జగతీపరిభ్రమణహేలకు వేలకు వేలు లక్షకో
ట్లై జరుగున్ మహాణువులయందున నేయణుగర్భమందునో
రాఁజినకోర్కిమంటలభరం బితరాణు లెఱుంగకుండ లో
రాఁజి తనంతటన్ పొనుగురాయఁగరా దటవే! ననుంబలెన్.

